# ప్రవక్తల వాణి

ఫాదర్ పి. జోజయ్య, S.J.
ఆంధ్ర లొయోలా కాలేజి
విజయవాడ - 520 008
ఫోను : 0866 - 2476329

# విషయసూచిక


| | |
|---|---|
| 1. ప్రవక్తల లక్షణాలు | 5 |
| 2. ధైర్యంగల ప్రవక్త | 14 |
| 3. యెషయా పిలుపు | 17 |
| 4. శిక్షకు గురైన ద్రాక్షతోట | 21 |
| 5. సాంఘిక న్యాయం | 24 |
| 6. రెండవ యెషయా | 26 |
| 7. స్త్రీ తన పసికందును మరిచిపోతుందా? | 28 |
| 8. శ్రమలు అనుభవించిన ప్రవక్త | 30 |
| 9. యిర్మీయా పిలుపు | 32 |
| 10. కపట ప్రవక్త హనన్యా | 36 |
| 11. యిర్మీయా హృదయ వేదనలు | 39 |
| 12. విలక్షణమైన ప్రవక్త | 46 |
| 13. దుఃఖితులను ప్రోత్సహించే దేవుడు | 48 |
| 14. దేవాలయం క్రిందినుండి పారే నీరు | 50 |
| 15. ప్రవక్తను ప్రజలదగ్గరికి పంపడం | 53 |
| 16. దేవుని విఫలప్రేమకు సాక్షి | 55 |
| 17. ఆమోసుకి యాజకునితో ఘర్షణం | 58 |
| 18. శత్రువులను క్షమింపని ప్రవక్త | 62 |
| 19. అందరూ ఆత్మను స్వీకరిస్తారు | 66 |
| 20. ప్రవక్తకీ రాజుకీ ఘర్షణం | 68 |
| 21. క్రీస్తు ప్రవక్త | 71 |
| 22. నేటి సమాజంలో ప్రవక్తలు | 72 |
| 23. ప్రశ్నలు | 75 |

# మనవిమాట

పూర్వవేదంలో ప్రవక్తల గ్రంథాలు పదహారున్నాయి. యిస్రాయేలు ప్రజలు తనకు దూరంగా పోయినప్పుడెల్ల దేవుడు ప్రవక్తలను ప్రేరేపించేవాడు. వాళ్లు తమ బోధలతో జనులను మళ్లా ప్రభువు దగ్గరికి రాబట్టేవాళ్లు. ఈ భక్తులు గొప్ప దైవానుభూతి కలవాళ్లు. నిరంతరం దేవుని మార్గాల్లో నడుస్తూ ఆ ప్రభువును గూర్చి బోధించే వాళ్లు.

ఈ పుస్తకంలో ప్రవక్తల గ్రంథాలనుండి కొన్ని అధ్యాయాలను ఎత్తుకొని వాటిమీద వివరణం చెప్పాం. మన విశ్వాసులకు ప్రవక్తల గ్రంథాలతోను బోధలతోను ఒకపాటి పరిచయం కలిగించడం ఈ పుస్తకం ఉద్దేశ్యం.

ప్రవక్తల వాక్కుల్లో ఏదో దివ్యశక్తి దాగివుంటుంది. అవి ప్రజల హృదయాలను కదిలించి వారిని దేవుని చెంతకు చేరుస్తాయి. నేడు మన హృదయాలను కూడ స్పందన కలిగిస్తాయి.

పాఠకులు మా పూర్వగ్రంథాలనువలె దీన్ని గూడ ఆదర భావంతో స్వీకరిస్తారని ఆశిస్తున్నాం.

– గ్రంథకర్త.

పూర్వం యోబు కూడ ఈలాగే తాను పుట్టిన దినాన్ని శపించాడు -3,3-13. మహాభక్తుల ఆవేదన చాల ఘోరంగా వుంటుంది.

ప్రభువు యిర్మీయాను కూలద్రోయడానికే పునర్నిర్మించడానికీ గూడ పిల్చాడు. పైన మనం చూచిన వేద భాగాలన్నీ కూలద్రోయడాన్ని గూర్చే. పునర్నిర్మించే బాగం ఇంకా రాలేదు. అందుకే అతనికి తన బాధలే అంత తీవ్రమనిపించాయి.

## 6. ప్రార్థనా భావాలు

1. యిర్మియా వాక్యభక్తి మనకు ప్రేరణం పుట్టించాలి. ప్రభువు తన వాక్కునెత్తి అతని నోటిలో పెట్టాడు -1,9. అతడు ఆ వాక్యాన్ని అన్నంలా భుజించాడు -15,16. స్వర్గంలోని దైవసభలోనికి ప్రవేశించి దేవుని వాక్కుని ఆలించాడు - 23,18, ఆ వాక్కు అతని హృదయంలో అగ్నిలా మండి నన్ను చెప్పు అని నిర్బంధం చేసింది - 20,9. ఈ వాక్యభక్తి వల్లనే అతడు శత్రువులు పెట్టిన బాధలన్నీ భరించి జీవితాంతం ప్రవచనం చెప్పుకొంటూపోయాడు. ఈ భక్తే లేక పోతే నిరాశకు గురై నశించేవాడే నేడు మనంకూడ వాక్యభక్తిని అలవర్చుకోవాలి.

2. ప్రభువు యిర్మీయాను పెండ్లిజేసికోవద్దని ఆజ్ఞాపించాడు -16,2. కనుక అతడు వంటరిగా వుండిపోయాడు. సంతోషాలకూ సంబరాలకూ దూరంగా వుండిపోయాడు - 15,17. ప్రభువు తన భక్తులనుండి ఎన్నో త్యాగాలూ నిగ్రహాలూ కోరుతాడు వారికి తీవ్రశ్రమలు కలిగిస్తాడు. మనకు పునీతుల అద్భుతక్రియలు మాత్రమే తెలుసుగాని వాళ్ళు అనుభవించిన ఘోరశ్రమలు తెలియవు.

3. ఒక దశలో యిర్మీయా నిరాశచెంది తన పిలుపును వదలుకోవాలి అనుకొన్నాడు. ఆ తరుణంలో ప్రభువు అతన్ని చక్కదిద్దాడు. నీ నిరాశా భావాలు మానివేసి ఉదాత్తమైన నాసందేశాన్ని ప్రజలకు విన్పించమన్నాడు. నీవు నాకు దూరంగా పోతున్నావు, నా వద్దకు

తిరిగిరమ్మన్నాడు. నేను నిన్ను నా సేవలో పదిలపరచి ఇత్తడి ప్రకారంలాగ బలపరుస్తాను అన్నాడు -15,19. మన ప్రేషిత సేవలో బోలెడంత స్వార్థం వుంటుంది. నేను, నా గొప్ప అనే భావం ప్రబలంగా వుంటుంది. ప్రభువు కొన్ని కష్టాలద్వారా క్రమేణ ఈ స్వార్థాన్ని తొలగించి మన ప్రేషితసేవను నిర్మలం చేస్తాడు. యిర్మీయా ఎట్టిపరిస్థితుల్లోను తన ప్రేషితసేవను వదలుకోలేదు. నేడు మనం చేయవలసిందికూడ ఇదే.

4. ప్రభువు వారు వాక్కు యిర్మీయా హృదయంలో అగ్నిలా మండుతూ నిరంతరం అతనికి ప్రేరణం పుట్టిస్తుండేది -20,9. ప్రజలు విన్నా వినకపోయినా అతనిచేత ప్రవచనం చెప్పిస్తుండేది. ఇది ఆంతరంగికమైన ఆత్మ ప్రేరణం. నేడు మన ప్రేషిత సేవలో ఆత్మ మనకు కూడ ప్రేరణం పుట్టించాలి.

5. ప్రజలు తన బోధవినక తన్ను నిరాకరించినా ప్రవక్త వారి తరపున నిరంతరం దేవునికి మనవి చేసేవాడు. వాళ్లు నాశమై పోతారని దుఃఖించేవాడు - 18,20. యూదా మక్కబీయుడు యిర్మీయా పరిశుద్ధ నగరంకొరకు ప్రార్థన చేస్తుండగా దర్శనంలో చూచాడు - 2 మక్క 15,14. నేడు మనం సేవలు జేసే ప్రజలు కూడ కొన్నిసార్లు మనలను నిరాకరిస్తారు. ద్రోహంచేస్తారు. ఐనా మనం వారికొరకు ఎప్పుడూ దేవునికి విజ్ఞాపనం చేస్తూనే వుండాలి. ఈ విజ్ఞాపనం గూడ మన సేవలో ఓ భాగం అనుకోవాలి.

6. భగవంతుడు తన భక్తులను అనేక శ్రమల ద్వారా పునీతులను చేస్తాడు. యిర్మీయా జీవితంలో ఇదే జరిగింది. నేడు మన జీవితంలో గూడ అపజయాలు, అపార్థాలు, వ్యాధిబాధలు, ప్రజలనుండి నిరాకరణం మొదలైన సిలువలు ఎదురౌతాయి. ఐనా వీటిద్వారానే దేవుడు మనలను పవిత్రపరుస్తాడు.

# 12. విలక్షణమైన ప్రవక్త

యెహెజ్కేలు యాజకుడు, ప్రవక్త. క్రీ.పూ 593–70 ప్రాంతంలో ప్రవచనం చెప్పాడు. యెరుషలేము పతనానంతరం ప్రవాసులతో పాటు బాబిలోనియాకు వెళ్లాడు. అక్కడ ప్రవాసులను ప్రోత్సహిస్తూ దైవసందేశాలు విన్పించాడు.

ఇతని ప్రవచనం చాల పర్యాయాలు దర్శనాల రూపంలో వుంటుంది. ఇతని తర్వాత దర్శన సాహిత్యం బాగా ప్రచారంలోకి వచ్చింది. దానియేలు గ్రంథకర్త నూత్నవేదంలో దర్శనగ్రంథక్త ఇతని నుండి ప్రేరణం పొందారు.

ఇతనిలోని మరొక లక్షణం, తన బోధలను నటించి చూపించడం, ఉదాహణకు యెరూషలేము ముట్టడిని నటించిచూపించాడు – 4. దర్శనాలు చూడ్డం, నటించి చూపించడం – ఈ రెండంశాల్లోను ఇతడు మేటి. చాల విలక్షణమైన ప్రవక్త. తన గ్రంథంలో అనేక సంకేతాలు వాడాడు. కొన్నిసార్లు ఇతని వర్ణనలు మొరటుగాను అసహ్యంగాను వుంటాయి. ఐనా చాల గొప్ప ప్రవక్త.

ప్రభువు యెషయా పెదవులు కాల్చాడు. తన వాక్కు నెత్తి యిర్మీయా నోటిలో పెట్టాడు. కాని యెహెజ్కేలు ప్రభువు వాక్యాలు వ్రాసివున్న చర్మపు చుట్టనే భుజించాడు –3,3. ప్రవక్తలు ప్రభువు వలన ప్రేరితులై సందేశం చెప్తారని ఈ దర్శనాల భావం.

యెహెజ్కేలు ప్రధాన భావాలు ఇవి. 1. ప్రజల పాపాలకు కోపించి దైవసాన్నిధ్యం యెరూషలేమును వీడి వెళ్లిపోయింది –11,23. దైవరక్షణాన్ని కోల్పోయిన ఆ నగరం త్వరలోనే నాశమైపోతుంది.

2. దేవుడుంటే నరులకు జీవం, లేకపోతే మరణం. దేవుని ఆత్మ యెండిన ఎములకు ప్రాణాన్నిస్తుంది –37. దేవుని జీవనది ఎడారిని వృక్షభరితం చేస్తుంది. ఉప్పునీళ్ల సరస్సుని తీయని నీళ్లుగా మారుస్తుంది –47.

3. తండ్రుల పాపాలు తనయులను బాధించవు. ఎవరి పాపానికి వాళ్ళే బాధ్యులౌతారు. పాపం చేసినవాడు నశిస్తాడు. కనుక ప్రతినరుడు నిబంధన నియమాలను పాటించాలి -18,4.

4. యూదులు యావే ప్రభువు యెరూషలేము దేవళంలోనే వుంటాడు, యూదులను మాత్రమే రక్షిస్తాడు అనుకొన్నారు. యెహెజ్కేలు దేవుడు అన్నిజాతులను పట్టించుకొంటాడు అని చెప్పాడు. అందుకే దైవసాన్నిధ్యం దేవాలయాన్ని వీడి జాతులమధ్యకు వెళ్లిపోయింది. అన్ని జాతులను ఏలేది, చరిత్రగతిని నడిపించేది ప్రభువే.

5. నరులు మతాచారాన్ని సులువుగా బాహ్యాచారం గాను కర్మకాండగాను మార్చివేస్తారు. ఈ ప్రవక్త హృదయగతమైన మతాన్ని బోధించాడు. దైవారాధనం ప్రధానంగా హృదయంలో వుంటుందని చెప్పాడు. హృదయం దేవునికి అంకితం కావాలి. ఇందుకు గాను దేవుడు నరుల హృదయాల్లో మార్పుతెస్తాడు. రాతి గుండెను తొలగించి మాంసపు గుండెను దయచేస్తాడు - 36,26.

హీబ్రూ ప్రజలకు మొదట దేవుని పట్ల భక్తి విశ్వాసాలు వుండేవి. కాని ప్రవాసకాలంలో అవి అంతరించాయి. ఈ ప్రవక్త తన బోధలద్వారా ప్రజల్లో అడుగంటిపోయిన భక్తి విశ్వాసాలను మళ్లా మేలు కొల్పాడు.

ప్రజలు ధర్మశాస్త్రాన్ని అశ్రద్ధచేసి ప్రవాసశిక్షను తెచ్చుకొన్నారు. ఈ ప్రవక్త ధర్మశాస్త్రాన్ని పునరుద్ధరించి ప్రజలను మళ్లా దేవుని దగ్గరికి రాబట్టాడు. ఇతని తర్వాత వచ్చిన యెజ్రా యూదమతాన్ని కేవలం ధర్మశాస్త్రమతంగా మార్చివేసాడు.

మనకు నూత్నవేదంలో కన్పించే స్వర్లోకపు యెరూషలేము, జీవనది, మంచికాపరి, ద్రాక్షలత, మనుష్యకుమారుడు మొదలైన భావాలకు యెహెజ్కేలు ప్రవచనమే ఆధారం.

# 13. దుఃఖితులను ప్రోత్సహించే దేవుడు

# - యెహె 37,1-14.

## 1. సందర్భం - 18.

యూదులు క్రీ.పూ. 587లో బాబిలోనియా దేశానికి ప్రవాసానికి వెళ్లారు. అక్కడ వాళ్లు నిరుత్సాహభావాలతో వున్నారు. దేవుడు మమ్మ చేయి విడిచాడు. మేమీ పరాయిదేశంలో ఎండిపోయిన ఎముకల్లా వున్నాం అని విలపిస్తున్నారు. వారిని ప్రోత్సహిస్తూ యెహెజ్కేలు ఈ ప్రవచనం చెప్పాడు. అతడు యాజకుడు, ప్రవక్త. ఈ ఘట్టం బైబుల్లోని అతి ప్రశస్త భాగాల్లో వొకటి. ఇక్కడ 1-10 వచనాలు దర్శనం. 11-14 వచనాలు దానిమీద ప్రభువు చెప్పిన వివరణం.

## 2. దర్శనం 37,1-10

ప్రభువు ఆత్మ ప్రవక్తను ఒక లోయలోనికి కొనిపోయింది. పూర్వం అక్కడ యుద్ధం జరిగింది. కనుక మృతసైనికుల ఎముకలు గుట్టలుగా పడివున్నాయి. వాటిలో జీవం ఏ మాత్రం లేదు.

దేవుని ఆజ్ఞపై ఆ అస్థికలకు ఊపరి రావాలని ప్రవచనం చెప్పాడు. వెంటనే అవి ఒకదానితో వొకటి కలసికొన్నాయి. వాటికి కండరాలూ చర్మమూ వచ్చాయి. ఎవని యెముకలు ఆ నరుడుగా కలిసికొని భూమిపై పడివున్నాయి. ఈ దశలో ఆ దేహాలకు ఇంకా ప్రాణంలేదు.

దేవుని ఆజ్ఞపై ప్రవక్త ఆ దేహాలకు ప్రాణం రావాలని రెండవసారి ప్రవచనం చెప్పాడు. అతడు చెప్పినట్లే రెండవదశలో ఆ దేహాలకు ఊపిరికూడ వచ్చింది. అవి లేచి పెద్ద సైన్యంగా నిలబడ్డాయి. ఆ సైనికులు పూర్వం అక్కడ యుద్ధంజేసి చనిపోయిన వీరులు. ఇది ప్రవక్తకు కలిగిన దర్శనం. ఇది చాల అరుదైన దృశ్యం. ప్రపంచ సాహిత్యంలో ఈలాంటి దృశ్యం మరెక్కడా తగలదు.

## 3. దర్శనం మీద వివరణం 37,11-14.

ఈ దృశ్యాన్ని ఆధారంగా తీసికొని ప్రభువు ప్రవక్తకు దానిమీద వివరణం చెప్పాడు. ఈ యెముకలు ప్రవాసంలోని యిస్రాయేలు ప్రజలనే సూచిస్తాయి. వాళ్లు ఇక్కడ మా ఆశ విఫలమైంది మేము చచ్చిన వాళ్లలా వున్నాం అని విలపిస్తున్నారు. మేము సమాధిలో పాతిపెట్టబడిన శవాల్లాగ వున్నాం అని దుఃఖిస్తున్నారు. బాబిలోనియా దేశం యుద్ధాల్లో దానికి వోడిపోయిన అనేక జాతులకు సమాధి ఐంది. ప్రభువు చెప్పిన వివరణను విన్పించి ప్రవక్త ప్రవాసులను ఊరడించాడు. మీరు మళ్లా బాబిలోనియా సమాధినుండి లేస్తారని చెప్పాడు.

దేవుడు తన ఆత్మను ప్రవాసుల మీదికి పంపి వారిని బాబిలోనియా సమాధినుండి లేపుతాడు. ప్రవాసం ముగుస్తుంది. వారిని మళ్లా పాలస్తీనా దేశానికి కొనివస్తాడు. వాళ్లు మళ్లా అక్కడ నగరాన్ని నిర్మించుకొని, దేవాలయాన్ని కట్టుకొని ప్రభువును పూజించుకొంటారు. ఇదంతా ప్రభువు ఆత్మదయచేసే దివ్యశక్తి వలన జరుగుతుంది. ప్రవక్త చెప్పిన ఈ ప్రవచనాన్ని విని ప్రవాసంలోని యూదులు ఉత్సాహం తెచ్చుకొన్నారు. ప్రవాసం త్వరలోనే ముగుస్తుంది కదా అని సంతోషించారు.

## 4. ప్రార్థనాభావాలు

1. బాబిలోనియా ప్రవాసంలో నిరుత్సాహంగా వున్న యూదులను ప్రవక్త ఈ దర్శనం ద్వారా ఉత్తేజపరచాడు. దేవుడు మళ్లా మీకు ఊపిరిపోస్తాడు. మీరు చనిపోయిన వాళ్లు బ్రతికినట్లుగా మళ్లా బ్రతుకుతారు అని చెప్పాడు. ఆ పలుకులకు ప్రజల్లో మళ్లా ఆశలు చిగురించాయి. నేడు మన జీవితంలో కూడ వ్యాధిబాధలు అపజయాలు, శోధనలు, పాపాలు మొదలైనవి యెదురై మనలను నిరుత్సాహ పరుస్తుంటాయి. ఈలాంటి పరిస్థితుల్లో ప్రభువు మనలను ప్రోత్సహిస్తాడు. మనకు మళ్లా ఊపిరిపోస్తాడు.

2. దేవుడు తన ఊపిరిని అనగా ఆత్మను ఎముకల మీదికి పంపి వాటికి జీవమిచ్చాడు. ఈ యాత్మ పూర్వం ఒక మట్టిముద్దలోనికి దిగివచ్చి దానికి జీవమిచ్చింది. అతడే తొలి ఆదాము – ఆది 2,7. పెంతెకోస్తునాడు శిష్యుల మిదికి దిగివచ్చి వారికి ప్రేరణను పుట్టించింది –అచ 2,38. నేడు జ్ఞానస్నాన సమయంలోను, ఇతర సందర్భాల్లోను మన మీదికి దిగివచ్చి మనకు శక్తినిస్తుంది. ఉత్థాన క్రీస్తు తన ఆత్మద్వారా ఇప్పుడు మనలను ప్రోత్సహిస్తాడు. ప్రభువునుండి ఆత్మను అడుగుకొని మనలోని నిరుత్సాహ భావాలను తొలగించుకొందాం.

3. జీవితంలో ఆనందానుభూతి, విచారానుభూతి అని రెండు దశలుంటాయి. ఆనందానుభూతివల్ల మనకు సంతోషం, శాంతి, ఉత్సాహం, దేవునిపట్ల నమ్మకం, భక్తి మొదలైన భావాలు కలుగుతాయి. ఇది పవిత్రాత్మ కలిగించేదశ. విచారానుభూతి వల్ల మనకు నిరుత్సాహం అపనమ్మకం, దిగులు, లోకవస్తువులమీద కోరిక మొదలైన భావాలు కలుగుతాయి. ఈ దశ పిశాచం నుండి వస్తుంది. మనం ఆయా సమయాల్లో ఏ దశలో వున్నామో గుర్తిస్తుండాలి. ఆనందాను భూతిని దయచేయమని దేవుని ఆత్మను అడుగుకోవాలి.

4. దేవుడు సర్వశక్తిమంతుడు. ఎండిన యెముకలకు జీవమిచ్చేవాడు. అతడు మన జీవితాలను గూడ మార్చి వేస్తాడు. మన జీవితాలను ఉత్సాహంలో నింపమని ఆ ప్రభువుని అడుగుకొందాం. నిరుత్సాహ భావాలు కలిగినప్పుడు ఈ ఘట్టం చదువుకొని ప్రేరణం పొందుదాం.

# 14. దేవాలయం క్రింది నుండి పారే యేరు. - 47,1-13.

## 1. దర్శనం

ఇక్కడ యెహెజ్కేలు నదీదృశ్యం చూచాడు. దేవాలం క్రింది నుండి చిన్న కాలువ పారడం గమనించాడు. చారిత్రకంగా దేవాలయం

క్రిందిభాగాన గీహోను అనే ఊట వుండేది. దీని నుండి చిన్న కాలువ పారేది - కీర్త 464.

ఇక్కడ దేవుని మందిరం అన్ని దీవెనలకూ నిలయమని ప్రవక్త భావం. దైవసాన్నిధ్యం నరులకు అన్ని వరాలు దయచేస్తుంది.

దేవాలయంనుండి బయలు దేరిన కాలువ పోనుపోను పెరిగిపోయింది. దేవదూత దాన్ని మొదట కొలవగా అది చీలమండలదాకా వచ్చింది, రెండవసారి కొలవగా మొకాళ్లవరకు, మూడవసారి కొలవగా రొమ్ముమవరకు వచ్చింది. నాల్గవసారి కొలిస్తే దాటడానికి వీలు లేనంత లోతుగా వుంది. చిన్న కాలువ క్రమేణ పెద్దనదిగా పెరిగిపోయిందని భావం.

అంతట దేవదూత ఆనది గొప్పతనాన్ని ప్రవక్తకు తెలియజేసాడు. అది మృతసముద్రంలో కలసి దానిలోని ఉప్పునీటిని మంచినీరుగా మారుస్తుంది. ఇది పెనుమార్పు.

ఆ నది పారిన తావుల్లో జీవం నెలకొంటుంది. దాని నీళ్లలో చేపలు సమృద్ధిగా జీవిస్తాయి. ఆ ప్రాంతంలో బెస్తల పల్లెలు విస్తరిల్లు తాయి. బెస్తలు చేపలను పట్టి వలలు ఆరవేసికొంటారు. నదినీళ్లల్లో కొన్ని బురదగుంటల్లో చేరి ఉప్పు పండించడానికి ఉపయోగపడతాయి.

ఇంకా ఆ నది వొడ్డులపై అన్నిరకాల పండ్లచెట్లు పెరుగుతాన్నాయి - అవి ప్రతినెల కాపు కాస్తాయి. వాటి పండ్లు జనులకాహార మౌతాయి వాటి ఆకులు మందుగా వుపయోగపడతాయి. దేవాలయం క్రింద పుట్టి క్రమేణ పెరుగుతూ వచ్చిన నది ఇన్ని మార్పులు తెస్తుంది. యెషయా చెప్పినట్లు ఎండిన యెడారి పుష్పిస్తుంది - 351. ఈ వేదభాగంలో చాల భక్తిమంతమైన భావాలున్నాయి.

## 2. ప్రార్థనా భావాలు

1. ప్రవక్త ఈ ప్రవచనం చెప్పినపుడు దేవుని అనుగ్రహం వల్ల బాబిలోనియా ప్రవాసం ముగుస్తుందనీ, ఎడారిలా వున్న యూదయా

రాష్ట్రంలో పెద్ద నది పారి సమృద్ధి నెలకొంటుందనీ సూచించాడు. నీరు అభివృద్ధికి చిహ్నం. దేవుని ఆత్మ ఓ నదిలా నరుల హృదయాల్లోకి దిగివస్తుంది.

2. ఈ నీరు మొదట చిన్న కాలువగా వుండి తర్వాత మహానదిగా పెరిగింది. ఈ పెరుగుదల సువిశేషబోధ పెరగడానికి గురుతుగా వుంటుంది. మొదట పండ్రెండుమంది శిష్యులు మాత్రమే సువిశేషబోధను ప్రారంభించారు. తర్వాత అది ఐదు ఖండాల్లోను వ్యాపించింది. కోట్లకొలది ప్రజలు ఆ బోధను అగీకరించారు. నేడు మనం కూడ ఆ బోధ ఫలితాన్ని అనుభవిస్తున్నాం.

3. దేవాలయంనుండి కాలువ పుట్టింది. ఉత్థాన క్రీస్తు నుండి జీజల ప్రవాహం పుట్టి భక్తుల హృదయాల్లోకి పారుతుంది - యోహా 7,38.

4. జలం పవిత్రాత్మకూ వరప్రసాదానికీ, జ్ఞానస్నానానికీ చిహ్నం. ఆత్మ క్రీస్తు నుండి వచ్చేసి మన హృదయాల్లోకి ప్రవేశిస్తుంది.

5. దర్శన గ్రంథం 22,1-2 ఈ ఘట్టంలోని నదినీ దాని వొడ్లమీద పెరిగేపండ్ల చెట్లనీ పునశ్చరణం చేస్తుంది. ఈ దృశ్యం మొదట ఏదెను తోటకు వర్తిస్తుంది. అక్కడ కూడ నాల్గు పాయలుగా చీలిన జీవనది, పండ్లచెట్లు వున్నాయి - ఆది 28-10. కనుక ఇది పవిత్ర దృశ్యం. దైవానుగ్రహానికే, అభివృద్ధికే చిహ్నం.

6. ఈ దృశ్యం ఇప్పుడు మన జీవితానికి కూడ వర్తిస్తుంది. దేవుని ఆత్మ మన హృదయాల్లోకి దిగివచ్చి వాటిని తన వరప్రసాద జలాలతో నింపుతుంది. దీని ఫలితంగా మనం పుణ్యజీవితం గడుపుతాం. రోజు రోజుకీ ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుతాం. దేవుని దీవెనలు పొంది మన హృదయం పండ్లు కాసిన చెట్టులాగ అలరారుతుంది.

# 15. ప్రవక్తను ప్రజల దగ్గరికి పంపడం - 2,1-3,11.

## 1. దర్శనం - 18

ఈ వేదభాగంలో ప్రభువు ప్రవక్తను పిల్చాడు. అతన్ని ప్రజల దగ్గరికి వెళ్ళి సందేశం చెప్పమన్నాడు. అతని చేత తన దివ్యవాక్కుని తిన్పించాడు.

దేవునిఆత్మ యెహెజ్కేలుని ప్రేరేపించింది. అతనికి శక్తినీ నూత్నజీవాన్ని ప్రసాదించింది.

అతన్ని బాబిలోనియా ప్రవాసంలో వున్న యూదుల దగ్గరికి వెళ్ళి దైవసందేశం చెప్పమని ఆజ్ఞాపించింది. ఆ ప్రజలు ఎప్పుడూ దేవుని ఆజ్ఞలు మీరి అతనిమీద తిరుగుబాటు చేసేవాళ్ళు. కనుకనే ఇప్పుడు ఈ ప్రవాసంలో వున్నారు. వాళ్ళు విన్నా వినకున్నా ప్రవక్త సందేశం చెప్పవలసిందే. అతని పలుకు వారి తలబిరుసుతనాన్ని లొంగదీసికొంటుంది.

ప్రజలు తన్నెదిరిస్తాని ప్రవక్త భయపడకూడదు. ధైర్యంతో దైవసందేశం చెప్పవలసిందే వాళ్ళతో మెలగడం తేళ్ళతో మెలిగినట్లుగా కష్టంగా వుంటుంది. ఐనా ప్రవక్త దైవశక్తి కలవాడు కనుక భయపడకూడదు.

ప్రవక్త దేవుని వాక్కుని విన్పించాలి. కనుక ప్రభువు అతనిచే పుస్తకం చుట్టను తినిపించగోరాడు. దేవుడే ఆ చుట్టను ప్రవక్తకు అందించాడు. దానిమీద యూదియారాష్ట్ర పతనాన్ని గూర్చిన విలాపవాక్యాలు వ్రాయబడి వున్నాయి. వాటిని పూర్వం యిర్మీయా చెప్తుండగా అతని శిష్యుడు బారూకు వ్రాసాడు. యెహెజ్కేలు పూర్వప్రవక్తల సందేశాన్ని పునశ్చరణం చేస్తాడని భావం.

దేవుని ఆజ్ఞపై ప్రవక్త ఆ చర్మపు చుట్టను భుజించాడు. దానిలోని వాక్యాలన్నీ ప్రవక్త ఉదరంలోకి ప్రవేశించాయి. అనగా అతడు దైవశ్రుతినీ

దైవసందేశాన్నీ స్వీకించాడని భావం. అతడు తన సొంతభావాలను గాక దేవుని సందేశాన్ని విన్పిస్తాడని అర్థం. పూర్వం యిర్మీయా కూడ దేవుని వాక్కుని భుజించాడు - 15,16. ప్రవక్తలు దేవుని సందేశాన్ని జీర్ణం చేసికొని దాన్నిమాత్రమే ప్రజలకు విన్పిస్తారు.

ఆలా ప్రవక్త దేవుని వాక్కుని భుజింపగా అది అతని నోటికి తేనెలాగ తీయగా వుంది. దేవుని పలుకుని ప్రవక్త ఇష్టంతో స్వీకరిస్తాడు, ప్రీతితో ప్రకటిస్తాడు. దైవవాక్కు భక్తులనోటికి తేనెలాగ ఇంపితంగా వుంటుంది - కీర్త 19,10.

ప్రవక్త తిన్న వాక్యం అతనిలోనికి మారిపోయింది. ఇక అతన్ని ఆవాక్కే నడిపిస్తుంది, అతని చేత మాటలాడిస్తుంది. ప్రజలు అతనిలో ఏదో దివ్యశక్తి వుందని గుర్తిస్తారు.

ప్రభువు ప్రవక్తను బాబిలోనీయుల దగ్గరికి పంపలేదు. ఆలా పంపితే ఆ యన్యజాతివారు అతని బోధ వినేవాళ్లే. కాని అతన్ని యూదుల దగ్గరికి పంపాడు. వాళ్లు మొండివాళ్లు. అతని సందేశాన్ని సులభంగా వినరు. అతన్ని అంగీకరించారు. కనుక దేవుడు ప్రవక్తను బలపరచాడు. అతన్ని చెకుముకి రాయిలాగ, వజ్రంలాగ గట్టివాణ్ణిగా చేసాడు. కావున అతడు ప్రజలకు భయపడనక్కరలేదు. కడన ప్రభువు ప్రవక్తకు నేను నిన్ను ప్రజల దగ్గరికి పంపుతున్నానని రెండవసారి చెప్పాడు.

## 2. ప్రార్థనాభావాలు - 18

1. ప్రజలు దేవుణ్ణి విడనాడినా దేవుని వాక్కు వారిని విడనాడదు. ప్రవాసంలో గూడ అది వారితో మాటలాడుతుంది. వారిని హెచ్చరిస్తుంది. భగవంతుడు ఏనాడూ పాపిని విడనాడడు.

2. దేవుడు తనవాక్కుని యిర్మీయా నోటిలో పెట్టాడు. యెహెజ్కేలు ఆ వాక్కుని భుజించాడు. ప్రవక్తలు దేవుని వాక్కుని బాగా జీర్ణం చేసికొన్నారు. అతని చిత్తాన్నీ కోరికలనూ తెలిసికొన్నారు. వాటినే ప్రజలకు విన్పించారు. బోధకులు దేవుని వాక్కుని బాగా అనుభవానికి తెచ్చుకొన్న

వాళ్లయి వుండాలి. దేవుడు తమ ద్వారా మాటలాడేలాగ పవిత్ర జీవితం గడపాలి.

3. ప్రవాసంలోని యూదులు అవిధేయులు. దేవునిమీద తిరుగుబాటు చేసేవాళ్లు. దీనికి భిన్నంగా ప్రవక్త విధేయుడు. దేవుడు చెప్పినట్లుగా జనం దగ్గరికి వెళ్లి వ్యాక్యాన్ని విన్పించేవాడు. విధేయత భక్తుని లక్షణం. తిరుగుబాటు, తలబిరుసుతనం పాపలక్షణం.

4. ఇప్పుడు బైబుల్లో పదిలపరచబడిన దేవుని వాక్కు తీయగా వుంటుంది. ఇష్టం పుట్టిస్తుంది. దేవుణ్ణి అనుభవానికి తెస్తుంది. భక్తులు ఈ వాక్కుని పలుసార్లు మననం జేసికొని దైవానుభూతిని పొందాలి.

# 16. దేవుని విఫలప్రేమకు సాక్షి

## 1. సందర్భం

హోషేయ క్రీ.పూ. 750-722 ప్రాంతంలో జీవించాడు. ఉత్తరరాష్ట్రమైన సమరియాకు చెందినవాడు. 725లో ఈ రాష్ట్రాలన్ని అస్సిరియా రాజైనా టిగ్లాత్ పిలేసర్ నాగంజేసాడు.

హోషేయ విలక్షణగుణాలు కల ప్రవక్త ఇతని జీవితమే ప్రవచనమైంది. దేవుడు ఇతనితో నీవు వ్యభిచారిణియైన గోమెరును పెండ్లాడమని చెప్పాడు - 1,2. ప్రవక్త ఆలాగే చేసాడు. గోమెరు ముగ్గురు బిడ్డలను కన్న తర్వాత భర్తనువదలివేసి కనానీయుల దేవాలయంలో వేశ్యగా కుదిరింది. హోషేయాకు భార్యమీద గాఢమైన ప్రేమ వుంది. ఆమెకు మాత్రం పెనిమిటి మీద ప్రేమ కొరవడింది.

దేవుడు ప్రవక్తను భార్యను మళ్లా తీసికొనిరమ్మని ఆజ్ఞాపించాడు. ప్రవక్త ఆలాగే గోమెరును తీసికొని వచ్చాడు. ఆమెతో మళ్లా కాపురం చేసాడు -3,1-2.

ఈ సంఘటనను ఆధారంగా జేసికొని ప్రభువు ప్రవక్తచే ప్రవచనం చెప్పించాడు. గోమెరు భర్తను విడనాడి అన్యపురుషుల దగ్గరికి వెళ్లింది. ఆలాగే యిస్రాయేలు ప్రజలు యావేను విడనాడి విగ్రహాలను

కొలుస్తున్నారు. హోషేయ పెద్ద మనసుతో వ్యభిచారిణియైన భార్యను మళ్లా స్వీకరించాడు. యావే అన్యదైవాలను కొలిచే యూదజాతిని జాలితో మళ్లా స్వీకిస్తాడు. ఈ విధంగా ప్రవక్త ఆత్మకథే ప్రవచనమైంది. ఇక్కడ ప్రవక్త గోమెరును పెండ్లాడ్డం దేవుడు యిస్రాయేలును వధువుగా స్వీకించడం లాంటిది. సీనాయి నిబందనం ద్వారా దేవుడు యిస్రాయేలు ప్రజలకు భర్త అయ్యాడు వాళ్లు అతనికి వధువులాంటి వాళ్లు అయ్యారు. నిబంధన ఆజ్ఞలనమీరి అన్యదైవాలను కొలవడం ద్వారా ఆ ప్రజలు వ్యభిచారులయ్యారు.

సీనాయి నిబంధనం వివాహంలాంటిదని మొట్టమొదటిసారిగా చెప్పినవాడు హోషేయ తర్వాత ఇతర ప్రవక్తలు కూడ ఈ వుపమానాన్ని వాడారు.

గోమెరు చపలబుద్ధి కలది. భర్తను విడనాడి కనానీయుల దేవళంలో వేశ్యగా కుదిరింది. కనానీయులు తమ దేవళాల్లో బాలు, అషేరా ప్రణయాన్ని నటించి చూపించేవాళ్లు. యాజకుడు యాజకురాలిని కూడేవాడు. ప్రజలు దేవాలయానికి చెందిన వేశ్యలను కూడే వాళ్లు. దీని వలన నరులకు బిడ్డలూ, పశువులకు దూడలూ, పొలాలకు పంటలూ కలుగుతాయని నమ్మేవాళ్లు. భక్తిలేని యిస్రాయేలు ప్రజలు కూడ ఈ యారాధనల్లో పాల్గొనేవాళ్లు. గోమెరు వ్యభిచారిణియై ఈ కనానీయుల ఆరాధనలో పడిపోయింది. ఆమె భర్తకు ద్రోహంచేసినట్లే యిస్రా యేలీయులు విగ్రహారాధనం ద్వారా యావేకు ద్రోహం చేసారు. ప్రవక్త భార్యను క్షమించినట్లే దేవుడు మొదట యిస్రాయేలును శిక్షించి తర్వాత క్షమించి మళ్లా తన ప్రజలనుగా స్వీకరిస్తాడు. ప్రవక్తలు విహారాధనను వ్యభిచారంగా ఉపమించారు. హోషేయ జీవితం, బోధలు కూడ ప్రవచనమయ్యాయి. అతని విఫలప్రేమ దేవుని విఫలప్రేమకే గుర్తుగా వుంటుంది.

పూర్వవేదంలో దేవుని ప్రేమను మొట్టమొదటిసారిగా వర్ణించిన

ప్రవక్త హోషేయ. దేవునికి ప్రజలపట్ల వుండే ప్రేమ వివాహజీవితంలో భర్తకు భార్యపట్ల వుండే ప్రేమా లాంటిది అనేది అతని ప్రధానభావం. నూత్నవేదంలో పౌలు భక్తుడు ఈ భావాన్ని మళ్ళా ఎత్తుకొన్నాడు. ప్రజలు దేవునికి భ్యాలాంటివాళ్ళు అనే భావాన్ని సమాజపరంగాను, వ్యక్తిగతంగాను కూడ తీసికోవచ్చు.

దేవుడు నరులను గాఢంగా ప్రేమిస్తాడు. కాని నరులు దేవుని ప్రేమించరు. చిక్కు ఇక్కడే వుంది. ఆనాడు యిస్రాయేలు ప్రజలు దేవుణ్ణి కాదని విగ్రహాలను సేవించారు. ఇప్పుడు మనం విగ్రహాలను పూజించం. కాని ధనం, పలుకుబడి, సుఖభోగాలు మొదలైన లోకవస్తువులే మనకు విగ్రహాలై కూర్చుంటాయి. అందరమూ దేవుణ్ణి వదలివేసి అతడు చేసిన లోకవస్తువుల్లో పడిపోతాం.

## 2. ప్రార్థనాభావాలు

హోషేయ వాక్యాలు కొన్ని పరిశీలిద్దాం. దేశంలో దేవునిపట్ల నమ్మదగ్గిన తనం, దైవభక్తి, దైవజ్ఞానం బొత్తిగా లేవు - హోషే 4,1. ఈ వాక్యంలో మూడంశాలు వున్నాయి. మొదటిది, ప్రజల్లో నమ్మదగిన తనంలేదు. దేవుడు సీనాయి నిబంధనకు కట్టువడి వుంటాడు. కాని ప్రజలు ఆ నిబంధన షరతులను పాటించడం లేదు. అతనిలో వున్న నమ్మదగినతనం ప్రజల్లో లేదు. రెండవది, వారిలో దైవభక్తి లేక దైవప్రేమ లేదు. దేవునికి తానెన్నుకొనిన ప్రజలపై అపారప్రేమ వుంది. కాని ప్రజలకు దేవునిపై ప్రేమలేదు. మూడవది, ప్రజల్లో దైవజ్ఞానంలేదు. దేవుడు ప్రజలను ఈజిప్టునుండి విమోచించాడు. వారికి పైరుపంటలు పశుసంపద దయచేసాడు. వారి నెప్పుడూ గుర్తుపెట్టుకొంటాడు. కాని ప్రజలు అతనిద్వారా జరిగిన నిర్గమనం, నిబంధనం, ధర్మశాస్త్ర ప్రధానం మొదలైన విషయాలను స్మరించుకోరు. అతన్ని గుర్తుకి తెచ్చుకోరు. అసలు వారికి అతనిపట్ల వ్యక్తిగతమైన అనుభవంలేదు.

2. ప్రజల్లో కర్మకాండ ప్రబలిపోయింది. వాళ్ళు దేవాలయంలో

వట్టినే బలులు అర్పిస్తున్నారు గాని దేవుణ్ణి ప్రేమించడం లేదు. అతడు వారినుండి కోరేది ప్రేమకాని బలులూ దహనబలులూ కాదు. ఆ ప్రజలకు దేవునిపట్ల వున్న ప్రేమ పొగమంచులాగా క్షణికమైంది -6,4-6 ఇవి ప్రవక్త పలుకులు. నేడు మనకుదేవునిపట్ల వుండే ప్రేమ ఏ పాటిది?

3. దేవుడు తండ్రి, ప్రజలు అతని బిడ్డడిలాంటి వాళ్లు. వాళ్లను శిక్షించడానికి అతనికి చేతులు రావు. యిస్రాయేలు బాలుడైయుండగా దేవుడు వాళ్లను ప్రేమించాడు. చిన్న బిడ్డడికి లాగ నడవడం నేర్పించాడు. వారిని పైకెత్తి ముద్దుపెట్టుకొన్నాడు. క్రిందికి వంగి వారిచే అన్నం తినిపించాడు. ఐనా వాళ్లు దేవుని దగ్గరికి రావడంలేదు బాలు దేవతకు బలులర్పించి సాంబ్రాణిపొగ వేస్తున్నారు. ఇవి ఉద్వేగంతో కూడిన పలుకులు. హృదయాన్ని కదిలించే మాటలు -11,1-6. మన మట్టుకు మనం దేవుని ప్రేమను నిరాకరించిన సందర్భాలు ఎన్ని లేవు?

# 17. ఆమోసుకి యాజకునితో ఘర్షణం -7,10-17

## 1. సందర్భం

ఆమోసుకాలం క్రీస్తు పూర్వం 783-43 ప్రాంతం. ఇతడు యూదియా రాష్ట్రంలోని తేకోవ నగరవాసి. వృత్తిచే గొర్రెల కాపరి. అంజూరపు చెట్లను పెంచి వాటి కాయలకు గాట్లు వేసేవాడు. అప్పుడవి తీయని పండ్లుగా మారేవి ఇతడు రెండవ యరోబాము కాలంలో ఉత్తర రాష్ట్రంలోని బేతేలు నగరంలో ప్రవచనం చెప్పాడు ఆ నగరంలో యెరూషలేము దేవాలయానికి పోటిగా మొదటి యరోబాము కట్టించిన పెద్ద దేవాలయంవుంది. ఇది రాజు ప్రధాన దేవాలయం. అక్కడి ప్రధాన యాజకుడు అమస్యా. అతనికీ ప్రవక్తకీ ఘర్షణ జరిగింది.

ఆమోసు దక్షిణరాష్ట్రం నుండి ఉత్తరరాష్ట్రానికి వెళ్లి అక్కడ బేతేలు నగరంలోని దేవాలయంలో ప్రవచనం చెప్తున్నాడు. అస్సిరియా రాజులు

ఉత్తర రాష్ట్రాన్ని జయించి యూదులను ప్రవాసానికి తీసికొనిపోతారనీ, రాజు యుద్ధంలో చనిపోతాడనీ తెలియజేసాడు. కనుక ఆ దేవాలయ యాజకుడైన అమస్యా ప్రవక్తను ఎదిరించాడు. ఆమోసు నోరు మూయించమని రాజుకి సమాచారం పంపాడు. అతని బోధలు విని నగరంలోని దుర్మార్గులు రాజుపై తిరుగుబాటు చేస్తారని సూచించాడు. ఉత్తరరాష్ట్రం వాళ్లు యెరూషలేముకి వెళ్లకుండ ఆపడానికి రాజు బేతేలు దేవాలయాన్ని కట్టించాడు. కనుక అక్కడ రాజు అధికారం చెల్లుతుంది. అక్కడ మతాచరణం కంటె రాజకీయాలకు ప్రాముఖ్యం ఎక్కువ. కనుక అక్కడ ఆమోసు ప్రవచనం చెప్పడం సాహసమే ఔతుంది.

అమస్యా ఆమోసుని చిన్నచూపు చూచాడు. నీవు యూదియా రాష్ట్రానికి వెళ్లి అక్కడ ప్రవచనం చెప్పి పొట్టపోసికొమ్మన్నాడు. ఈ దేవాలయంలో యరోబాము అధికారం చెల్లుతుందన్నాడు.

యాజకుడు తనకు అడ్డువచ్చినందుకు ప్రవక్త కోపించాడు. ఆ రోజుల్లో కొందరు ప్రవక్తలు భుక్తికొరకు ప్రవచనం చెప్పేవాళ్లు. రాజులనూ అధికారులనూ మెప్పించడం వాళ్లపని. వాళ్లు అన్యజాతులు ఓడిపో బోతాయి. మన రాజుకి విజయం కలుగుతుంది అని అబద్ధాలు చెప్పేవాళ్లు. కాని ఆమోసు ఆలాంటివాడు కాదు. అతడు నేను దేవుడు పిల్చిన ప్రవక్తని. ఏ ప్రవక్తల సమాజానికి చెందక వంటరిగా ప్రవచనం చెప్పేవాణ్ణి. గొర్రెల కాపరిని, అంజూరాలు పెంచే సామాన్య నరుణ్ణి ఐన నన్ను దేవుడు ప్రవక్తగా నియమించాడు. కనుక దేవుని చిత్తాన్ని ఎరిగించడం నా బాధ్యత. నాది దేవుని అధికారం. నీది కేవలం రాజు అధికారం. రాజుకి యాజకుడవైనంత మాత్రాన నీవు నా వాక్కుని కుక్కివేయలేవు అని చెప్పాడు.

ఇంకా, తన వాక్కుని అణచివేయజూచినందుకు ప్రవక్త అమస్యాను శపించాడు. ఆ శాపవాక్యాలు ఇవి. అస్సిరియా రాజులు వచ్చి ఉత్తర రాష్ట్రాన్ని జయిస్తారు. ప్రజలను బంధీలనుగా పరాయి దేశానికి కొని

పోతారు. అమస్యాకూడ ఆ పరదేశంలోనే చస్తాడు. అతని బిడ్డలుపోరున చనిపోతారు. అతని భార్య బ్రతుకు తెరువు కొరకు శత్రుసైన్యానికి వేశ్యగా కుదురుతుంది. యాజకుడు దేవుని వాక్కుని అణచివేయ జూచినందుకు ఈ శిక్షలన్నీ వచ్చి పడతాయి.

రెండవ యరోబాము సమర్థుడైన పాలకుడు. కాని దైవభక్తి లేనివాడు. అతనినాడు రాష్ట్రం సిరిసంపదలతో తులదూగింది. కాని దేశంలో విగ్రహారాధన ప్రబలిపోయింది. నీతిన్యాయాలు అంతరించాయి. ధనికులు పేదలను పీడించారు. అధికారులు అన్యాయానికి పాల్పడ్డారు. కనుక ఆమోసు ఎక్కువగా సాంఘిక న్యాయాన్ని బోధించాడు. న్యాయం అతని బోధల్లో ప్రధానాంశం. ఇక్కడ కొన్ని ఉదాహణలు చూద్దాం.

ధనికులు తమ బాకీలు తీర్చలేని పేదలను బానిసలుగా అమ్మివేస్తున్నారు. దుర్బలుల తలలమీద కాళ్లుమోపి తొక్కుతున్నారు. వారిని త్రోవనుండి ప్రక్కకు నెడుతున్నారు. తమకు అప్పుపడివున్న పేదలనుండి ద్రాక్షరసం తీసికొని దేవళంలోనే త్రాగేస్తున్నారు. నీతిని విడనాడి తండ్రీ కొడుకూ ఒకే యువతని కూడుతున్నారు -2,6-8.

ధనికుల విలాసాలకు అంతులేదు. వాళ్లు దంతాలు పొదిగిన మంచాలపై పరుండి, సోఫాలపై ఆనుకొని లేదూడలు, గొర్రెపిల్లలు మాంసాలు మెక్కుతున్నారు. దావీదులాగ పాటలు కట్టి తంత్రవాద్యాలు మీటుతూ గానం చేస్తున్నారు. ఒడలికి పరిమళ తైలాలు పూసికొని పాన పాత్రల నిండ ద్రాక్షరసం పోసికొని త్రాగుతున్నారు. వారి విందులు వినోదాలు త్వరలోనే అంతరిస్తాయి. అస్సిరియనులు వచ్చి దేశాన్ని ధ్వంసంచేసి సంపన్నులను ప్రవాసానికి కొనిపోతారు -64-7.

సమరియా మహిళలు బలిసిపోయిన ఆవుల్లావున్నారు. వాళ్లు దుర్బలులను కొల్లగొట్టి మద్యం తీసికొనిరమ్మని భర్తలను వేధిస్తున్నాను. కనుక అస్సిరియనులు వచ్చి ఈ ధనిక స్త్రీలను గాలానికి చిక్కిన

చేపలనులాగ ప్రవాసానికి లాగుకొనిపోతారు. నగరప్రాకారంలోని ద్వారం గుండ బయటికి ఈడ్చుకొని పోతారు -4,1-3.

దేశంలో కర్మకాండ ప్రబలిపోయింది. ప్రజలు దేవునిపేరిట జరిపే పండుగల్లో భక్తిలేదు. వారి ధాన్యబలులను దహనబలులను దేవుడు అంగీకరించడు. జనంలో చిత్తశుద్ధిలేదు. పరపీడనం మితిమీరిపోయింది. దేశంలో న్యాయం ఏరులాగ పారాలి. నీతి జీవనదిలాగ ప్రవహించాలి. అప్పుడుగాని దేవుడు సంతోషించడు -5,21-24.

ప్రజలు ప్రభువు దినం వస్తుందనీ, ఆనాడు అతడు తమకు మేలు చేస్తాడనీ ఆశిస్తున్నారు. కాని ప్రభువుదినం ప్రజలకు దీవెనలుగాక శిక్షను కొని తెస్తుంది. వెలుగునుగాక చీకటిని కొనివస్తుంది. అస్సిరియా దాడి ద్వారా దేవుడు ప్రజలను శిక్షిస్తాడు - 5,18-20

## 2. ప్రార్థనాభావాలు

1. ప్రవక్తలకు ప్రభువు వాక్కుపట్ల గాఢమైన నమ్మకం వుండేది. వాళ్లు ప్రభువు తమ్ము ఎన్నుకొన్నాడనీ, అతడు తమద్వారా పలికించే పలుకు నెరవేరి తీరుతుందనీ విశ్వసించేవాళ్లు. దేవుడు తన సేవకులైన ప్రవక్తలకు తెలుపకుండ ఎట్టికార్యాలు చేయడు అన్నాడు అమోసు -3,7. ఇంకా అతడు సింహంగర్జిస్తే భయపడనివాడెవడు? ప్రభువు ప్రవచనం చెప్పమంటే చెప్పని వాడెవడు అన్నాడు -3,7-8. నేడు బైబుల్లోని ప్రభువాక్యాన్ని భక్తి విశ్వాసాలతో చదువుకొంటే ప్రభువు మనకు కూడ ఎన్నో మేళ్లు చేసిపెడతాడు.

2. ఈ ప్రవక్త ప్రభువు వాక్కుకి కరువు వస్తుంది అన్నాడు. అది కూటికి నీటికి కలిగే కరువు కంటె ఘోరమైంది అన్నాడు - 8,11. ఇది శాపవాక్యం. మన జీవితంలో బైబులు వాక్యానికి కరువుండకూడదు. భక్తుడు రోజూ కాసేపు వాక్యాన్ని చదువుకొని ధ్యానం చేసికోవాలి. దీనివల్ల అతడు రోజురోజుకి దేవునికి దగ్గరౌతాడు.

3. ప్రవక్తలు సాంఘిక న్యాయంకొరకు తపించిపోయారు. ఆమోసు దేశంలో న్యాయం నదిలాగ పారాలి అన్నాడు –5,24. యిస్రాయేలు ప్రజలు ఒక్క సమాజంగా సీనాయి కొండ దగ్గర నిబంధనం చేసి కొన్నారు. కనుక వాళ్లు ఒకవైపు దేవునితోను మరొకవైపు పరస్పరమూను ఐక్యమైయుండాలి. ఒకరినొకరు మోసగిస్తే నిబంధనను మీరినట్లే. సమాజంలో సాంఘికన్యాయం అత్యవసరం. నూత్నవేద ప్రజలమైన మనం కూడ పరస్పరం నీతిన్యాయాలతో మెలగాలి. పరునికి దక్కవలసింది మనం కొట్టేయకూడదు. మోసానికి పాల్పడ కూడదు.

# 18. శత్రువులను క్షమింపని ప్రవక్త

యోనాగ్రంథం క్రీ.పూ. 5–4 శతాబ్దాల్లో పుట్టింది. ప్రవాసం నుండి తిరిగి వచ్చిన యూదులు తమ్ము బాధించిన అన్యదేశాలను ద్వేషిస్తున్నారు. దీనికి భిన్నంగా ఈ గ్రంథం దేవుడు అన్యదేశాలనూ, అన్యజాతులనూ కరుణిస్తాడని చెప్తుంది. పుస్తకం మొత్తం 48 వచనాలే. ఐనా ఇది బైబుల్లో విలక్షణమైన గ్రంథం. ఇది చారిత్రక కథ కాదు. కేవలం నీతిబోధకమైన కల్పిత కథ.

## 1. యోనా

ప్రభువు యోనాను నీవు నీనెవె నగరానికి వెళ్లి పశ్చాత్తాపన్ని బోధించమన్నాడు. నీనెవె అస్సిరియా రాజధాని. ఈ రాజ్యం యిస్రాయేలుకి ప్రబల శత్రువు 721లో ఈ రాజ్యాన్ని ఏలే సారగోన్ అనే రాజు సమరియా రాష్ట్రాన్ని నాశంజేసి యూదులను ప్రవాసానికి తీసికొని పోయాడు. కనుక నీనెవె అనగానే యోనాకు వళ్లు మండింది. నీనెవె పౌరులు తన బోధవల్ల పరివర్తనం చెంది దేవుని శిక్షను తప్పించుకోవడం అతనికి ఎంతమాత్రం ఇష్టంలేదు. కనుక దేవునినుండి తప్పించుకోవడానికి ఓడనెక్కి దూరానవున్నా స్పెయిను దేశంలోని తర్షీషుకి పారిపోయాడు. దేవుని ప్రవక్తే దేవుని ఆజ్ఞమీరడం విచిత్రం.

దేవుడు యోనాకు బుద్ధి చెప్పడానికి పెద్ద తుఫాను పంపాడు.

ఓడ సముద్రంలో మనిగిపోయేలా వుంది. ఓడలోని పరజాతి ప్రజలు దేవునికి ప్రార్థన చేసారు. కాని నిజదేవుని కొల్చే యోనా సోమరితనంతో వోడ క్రిందిభాగంలో పండుకొని నిద్రపోయాడు. నావికులు అతన్ని లేపి నీవేజాతివాడివని అడగ్గా యోనా నేను హీబ్రూ జాతివాడిని. భూమినీ సముద్రాన్నీ చేసిన యావే ప్రభువుని పూజించేవాణ్ణి అని గొప్పలు చెప్పుకొన్నాడు. సముద్రాన్ని చేసిన దేవుణ్ణి తప్పించుకోవడానికి అతడు సముద్రంలోనే ప్రయాణంచేయడం విడ్డూరం.

నావికులు చీట్లు వేయగా యోనా పేరు వచ్చింది. అతని వల్లనే తుఫాను పట్టుకొందని తేటతెల్లమైంది. కనుక నావికులు తమ్ము క్షమించమని దేవునికి మనవిచేసి యోనానెత్తి నడిసముద్రంలో పడవేసారు. దానితో తుఫాను శాంతించింది. ఓడ వెళ్ళిపోయింది. సముద్రంలో పడిన యోనాను పెద్దచేప మ్రింగివేసింది. అది అతనికి ఏ హాని చేయలేదు. పైగా రక్షణనిచ్చింది. ఈ చేపమూలంగా ఈ గ్రంథంబాగా ప్రసిద్ధిలోకి వచ్చింది. మూడు నాళ్ల తర్వాత దేవుని ఆజ్ఞపై చేప ప్రవక్తను వొడ్డున వెళ్లగక్కింది. ప్రభువు యోనాకు దయజూపి అతడు చనిపోకుండ కాపాడాడు.

## 2. నీనెవె నగరం

ప్రభువు రెండవసారి యోనాను నీనెవెకు వెళ్లి పశ్చత్తాపాన్ని బోధించమన్నాడు. కాని ఆ యన్యజాతి ప్రజలు పశ్చత్తాపపడి దేవుని శిక్షను తప్పించుకోవడం యోనాకు ఇష్టంలేదు. వాళ్లు దేవుని కోపానికి జక్కి నాశంగావాలని అతని కోరిక. కనుక అతడు అనిష్టంగా ఆ నగరానికి వెళ్లి పశ్చాత్తాపాన్ని బోధించాడు. నలభైరోజుల్లో ఈ నగరం నాశమౌతుంది, పరివర్తనం చెందండని ప్రకటించాడు. పూర్వం జలప్రళయం 40 రోజులు కొనసాగింది. ఎడారి ప్రయాణం 40 ఏండ్లు పట్టింది. బైబుల్లో 40 పూర్ణ సంఖ్య.

తాను దేవుని ఆజ్ఞమీరినందుకు యోనా పశ్చాత్తాపపడలేదు.

నీనెవె పౌరులు ఆ పట్టణాన్ని ఏలే రాజు పశ్చాత్తాపపడ్డారు. జనులు- కడకు ఆ నగరంలోని జంతువులు కూడ -గోనె తాల్చి ఉపవాసమున్నాయి. ఆనగర పౌరులు దుష్టులే. దేవుడు వారిని నాశంజేసేవాడే. కాని పశ్చాత్తాపాన్ని జూచి వారిని శిక్షించకుండ వదలి వేసాడు. అతడు యూదులకూ అన్యజాతులకూ గూడ కరుణ చూపే ప్రభువు.

## 3. ప్రభువు కరుణ

యోనా పశ్చత్తాపాన్ని బోధించడంలో నెగ్గాడు కాని అతడు తాను ఓడిపోవాలని కోరుకొన్నాడు. పౌరులు పశ్చత్తాపపడకూడదు అనుకొన్నాడు. కనుక తాను నెగ్గినందుకు విచారించాడు. ఇతర ప్రవక్తలు తమ బోధలో నెగ్గనందుకు చింతించారు. ఇతడు నెగ్గినందుకు చింతించాడు.

ప్రజల పరివర్తనాన్ని జూచి యోనా దేవునిమీద తిరగబడ్డాడు. నీవు దయగల దేవుడివి. పాపులు పశ్చాత్తాపపడితే వారిని శిక్షించక వదలివేస్తావు. ఈ సంగతి తెలిసే నేను నిన్ను తప్పించుకొని పారిపోయాను అని ఫిర్యాదు చేసాడు. యిస్రాయేలు ప్రజలు మాత్రమే రక్షణం పొంది, అన్యజాతులన్నీ నాశమైపోవాలని అతని కోరిక. కనుక అతడు నేనిక బ్రతికి మాత్రం ఏమిలాభం? చనిపోవడం మేలు అనుకొన్నాడు. దేవుడు అతని కోపాన్ని తొలగింపజూచాడుగాని యోనా వినలేదు.

అతడు దేవునిమీద అలిగి నగరానికి దూరంగా వెళ్లిపోయి ఓ గుడిసె వేసికొని దానిలో కూర్చున్నాడు. ఒకవేళ నగరం నాశమై పోతుందేమో చూద్దాం అనుకొన్నాడు. యిస్రాయేలుకి శత్రువులైన నీనెవె పౌరులు బావాలనే అతని కోరిక. కాని దేవుని కోరిక వేరు.

దేవుడు యోనా చెంత అద్భుతంగా ఓ సొరతీగను మొలిపించాడు. అది ఒక రోజుపాటు అతనికి నీడ నిచ్చింది. కాని రెండవ రోజు ఏదోపురుగు కొట్టివేయగా చచ్చింది. యోనా చుట్టూ ఎండ తీవ్రమైంది.

పైగా వేడిగాలి తోలింది. యోనా సొమ్మసిల్లి పడిపోబోతున్నాడు. అతడు తీగపోయినందుకు ఆగ్రహం చెందాడు. దేవునిపై అలిగి నేను బ్రతకడంకంటె చావడమే మేలు అని గొణిగాడు. నీనెవెకు రావలసిన వినాశం ఒక విధంగా అతన్ని ఆవరించింది.

దేవునికి ప్రవక్తకు పాఠంనేర్పేసమయం ఆసన్నమైంది, అతడు ప్రవక్తతో ఓయి! నీవు ఈ తీగను నాటలేదు, పెంచలేదు. అది నీది కాదు. పైగా అది ఒక్కరోజు మాత్రమే బ్రతికిన తీగ. ఇప్పుడు అది పోయినందుకు నీవు ఇంతగా విచారిస్తున్నావు. దానితో పోలిస్తే నీనెవె ఎంత పెద్దది! దానిలో లక్షయిరవై వేలమంది జనులున్నారు. ఇంకా చాల జంతువులు కూడ వున్నాయి. ఇంత పెద్దనగరం నాశమై పోతే నాకు బాధకలగదా అన్నాడు. యోనాకు తనతప్పు తెలిసింది. దేవుని కరుణ అర్థమైంది. అతడు నోటమాటరాక నిశ్చేష్టుడయ్యాడు.

## 4. ప్రార్థనా భావాలు

1. భారతదేశం అనేక మతాలు సంప్రదాయాలు, సంస్కృతులతో కూడిన దేశం. మామూలుగా మనం క్రైస్తవులకే గాని అన్యులకు రక్షణం లేదనుకొంటాం. ఇది పెద్దపొరపాటు. దేవుడు అందరి రక్షణాన్ని కోరతాడు –1తిమో 2,4. అన్నిమతాల్లోను రక్షణం వుంటుంది.

2. యోనా శత్రువులు నాశంగావాలని కోరుకొన్నాడు. కాని దేవుడు వాళ్ళు పశ్చాత్తాపడి రక్షణం పొందాలని కోరుకొన్నాడు. మనం ఏనాడు కూడ శత్రువులు నాశంకావాలని కోరుకోగూడదు. వాళ్ళ పరివర్తనం చెంది దేవుని అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరుకోవాలి.

3. దేవుడు కరుణామయుడు. దుష్టులను గూడ రక్షించాలని కోరుకొనేవాడు – నిర్గ 34,6–7. యోనాకాని, ప్రవాసంనుండి తిరిగి వచ్చిన ఆనాటి యూదులుకాని దేవుని ఈ కరుణాగుణాన్ని అర్థంజేసికోలేదు. అతడు ప్రవక్తకు దయజూపినా, ప్రవక్త నీనెవె పౌరులకు దయచూపలేదు. నేడు దోషులను గాని తప్పుజేసిన పిల్లలనుగాని శిక్షించేప్పుడు మనం జాలితో ప్రవర్తించాలి.

4. దేవునినుండి మనం చాలసార్లు క్షమాపణంపొందాం. ఈ క్షమాపణనే మనం ఇతులపట్లకూడ చూపాలి. మనకు ద్రోహంచేసిన వాళ్లను సులువుగా క్షమించాలి. పగతీర్చుకోవడం క్రీస్తు శిష్యుల లక్షణం కాదు.

5. క్రీస్తు యోనా గురుతును గూర్చి మాటలాడాడు. ఈ గురుతు ఏమిటి? యోనా మూడురోజులు చేపగర్భంలోను, క్రీస్తు మూడు రోజులు భూగర్భంలోను వున్నారు. ఇంకా, యోనా బోధవిని నీనెవె పౌరులు పశ్చాత్తాపంచెందాలి. ఆలాగే క్రీస్తు బోధ విని యూదులు పశ్చాత్తాప పడాలి. కాని పడ్డంలేదు - మత్త 12,39-11.

## 19. అందరూ ఆత్మను స్వీకరిస్తారు - యోవేలు 2,28-29.

యోవేలు క్రీస్తుపూర్వం ఆరవశతాబ్దంలో జీవించాడు. ఇతడు అంత్యకాలంలో దేవుని ఆత్మ అందరిమీదికి దిగివస్తుందని ప్రవచించాడు. ఈ ప్రవచనం తర్వాత నూత్నవేదకాలంలో నెరవేరింది.

దేవుని ఆత్మ సృష్టి ఆరంభంనుండీ వుంది. ఈ యాత్మద్వారానే దేవుడు లోకాన్ని సృజించి దానికి ప్రాణశక్తిని ఇచ్చాడు - ఆది 1,2. అన్ని ప్రాణుల్లోని జీవం ఆత్మనుండే వస్తుంది.

కాని యిక్కడ యోవేలు ప్రవక్త ఉద్దేశించింది ఆత్మదయచేసే ప్రవచన శక్తి. ఈ శక్తి మెస్సీయాకాలంలో అందరికీ లభిస్తుందని భావం. ఈ ప్రవచన శక్తి ద్వారా నరులు దివ్యశ్రుతిని, అనగా దేవుని రక్షణమార్గాన్ని తెలిసికొంటారు. యిస్రాయేలు ప్రజలంతా ఆత్మను స్వీకరించి ప్రవచనం చేస్తే బాగుంటుందని పూర్వం మోషే కోరుకొన్నాడు - సంఖ్యా 11,27. ఈ మోషే కోరిక సఫలమౌతుందని యోవేలు సూచించాడు.

యోవేలు ప్రవచనం ఇది మెస్సీయాకాలంలో యిస్రాయేలీ

యులందరు ఆత్మను స్వీకరిస్తారు. ఇంతవరకు ఆత్మ ప్రవక్తలకు, నాయకులకు మాత్రమే పరిమితం. ఇకమీదట అందరూ ఆత్మను పొందుతారు. దీనిఫలితంగా యిస్రాయేలు ప్రజలు ప్రవచిస్తారు, కలలు కంటారు, దర్శనాలు చూస్తారు. అనగా వాళ్లు అందరికీ దివ్యశ్రుతిని తెలియజేస్తారని భావం. స్త్రీ, పురుషులందరిమీదికి ఆత్మ దిగివస్తుంది. అనగా లింగభేదంవుండదు. ముదుసలులు, యువకులు కలలు కంటారు. అనగా వయోభేదం వుండదు. సేవకులు సేవకురాళ్లు ఆత్మను స్వీకరిస్తారు. అనగా వర్గబేధం వుండదు. అందరినీ ఆత్మ నింపుతుంది.

నూత్నవేదంలో పేతురు పెంతెకోస్తు సందర్భంలో బోధించినపుడు ఈ ప్రవచనాన్ని ఉదాహరించాడు - అ.చ. 2,17. యోవేలు దృష్టిలో యిస్రాయేలీయులు మాత్రమే ఆత్మను స్వీకరిస్తారు. అన్యజాతులు కాదు. పేత్రుదృష్టిలో అంత్యకాలంలో క్రైస్తవులు కూడ ఆత్మను పొందుతారు. పెంతెకోస్తు నాడు శిష్యులమీదికి ఆత్మదిగిరావడమే ఇందుకు నిదర్శనం. ఆత్మను పొందిన క్రైస్తవులు ఆత్మ ప్రేరణంతోనే క్రీస్తుని బోధిస్తారు. అదే వారి ప్రవచనం.

నేడు మనం జ్ఞానస్నానంలోనే ఆత్మను పొందుతాం. తర్వాత మన భక్తిక్రియల ద్వారా ఈ యాత్మను అధికాధికంగా స్వీకరిస్తాం. కాని మనం ఆత్మను పొందడం దేవునికి? ఆత్మ పని ఒకేవొక్కటి, మనలను క్రీస్తుదగ్గరికి రాబట్టడం. అందుకే యోహాను సువిశేషం ఆత్ముడు వచ్చి మిమ్ము సంపూర్ణ సత్యంలోకి నడిపిస్తాడు అని చెప్తుంది -16,13. ఈ సంపూర్ణసత్యం క్రీస్తే.

క్రైస్తవుడు ప్రధానంగా ఆత్మను స్వీకరించినవాడు ఆత్మచే నడిపింపబడేవాడు. ఆత్మను అనుభవానికి తెచ్చుకొన్నాడు. ఆత్మద్వారా క్రీస్తుపట్ల ఆకర్షితుడు అయ్యేవాడు. ఆ క్రీస్తుని అన్యులకు తెలియజేసేవాడు. కనుకనే యెరూషలేములోని శిష్యులు ఆత్మను స్వీకరించగానే క్రీస్తుని బోధించడం మొదలుపెట్టారు. తొలిరోజుననే మూడువేలమందికి

జ్ఞానస్నానం ఇచ్చారు. నేడు మనకు ఆత్మ పరిజ్ఞానం తక్కువ. అందుకే క్రీస్తుపట్ల భక్తికూడ తక్కువే. కనుక ఆత్మానుభవం కొరకు వేడుకొందాం.

# 20. ప్రవక్తకీ రాజుకూ ఘర్షణం -1 రాజు 22,1-38.

## 1. సందర్భం

అహాబు క్రీస్తుపూర్వం 874-53 మధ్య ఉత్తరరాష్ట్రమైన సమరియాను ఏలాడు. ఆ రాజుకీ అతని ప్రవక్తయైన మీకాయకు జరిగిన ఘర్షణమే ఈ యధ్యాయం.

అహాబు బాలు దేవతను కొల్చిన దుష్టరాజు. అతనికి సిరియానుండి గిలాదు నగరాన్ని స్వాధీనం చేసికోవాలన్న కోరిక పుట్టింది. కనుక యుద్ధానికి పునుకొన్నాడు. తన్ను సందర్శింపవచ్చిన దక్షిణరాష్ట్రపు రాజు యెహోషాఫాత్తునుండి సహాయం అర్థించాడు. ఈ రెండవరాజు మొదట ప్రవక్తలను సంప్రదించి దేవుని చిత్తాన్ని తెలిసికొందాం అన్నాడు.

అహాబు కొలువులో నాల్గు వందలమంది  కపట ప్రవక్తలు వున్నారు. రాజును పొగడి పొట్టబోసికోవడమే వాళ్లపని. కనుక వాళ్లందరు నీవు యుద్ధానికిపో. విజయం నిన్నే వరిస్తుంది అని దొంగప్రవచనాలు చెప్పారు. రాజు ఏమి వినగోరుతాడో అదే చెప్పారు. యెహోషాఫాత్తు వారి నిజాయితీని శంకించి మరో ప్రవక్తను పిలిపింపుమనగా మీకాయాను పిల్చారు. ఇతడు రాజుకి విరోధి. కాని నిజంచెప్పేవాడు.

కపట ప్రవక్తల్లో ప్రముఖుడైన సిద్కియా తలమీద రెండు ఇనుపకొమ్ములు ధరించాడు. అతడు రాజుతో నీవు సిరియనులను ఈ కొమ్ములతో పొడిచి విజయాన్ని చేపడతావు అని ప్రవచనం చెప్పాడు. ఇక్కడ ఇతడు కొమ్ములు తాల్చడం ప్రవచనాన్ని నటించి చూపిచడానికి. సిద్కియా తన మాంత్రిక శక్తివల్ల రాజు విజయాన్ని సాధిస్తాడని తెలియజేసాడు. ఈ కొమ్ములు రాజు అధికారానికీ శక్తికీ సూచనంగా వుంటాయి.

అహాబు మీకాయానుకూడ సలహా అడిగాడు నీవు యుద్ధానికిపో. నీకు తప్పక విజయం లభిస్తుందిలే అని వ్యంగ్యంగా పలికాడు. రాజు అతన్ని నిజం చెప్పమని ఆజ్ఞాపించాడు. మీకాయా యిస్రాయేలు సైన్యం కాపరిలేని మందఐంది. వారికి నాయకుడు లేడు కనుక వాళ్లు ఇంటికి వెళ్లవచ్చునని ప్రభువు సెలవిస్తున్నాడు అని ప్రవచనం చెప్పాడు అనగా యుద్ధంలో అహాబు చనిపోతాడని భావం. ప్రవక్త దర్శనంలో ఈ దృశ్యం చూచాడు.

మీకాయ ఇంకా ఈలా చెప్పాడు. నేను ప్రభువు స్వర్గంలో సింహాసనాసీనుడై యుండగా చూచాను. అతడు అహాబును మోసగించడానికి ఎవరు వెళ్తారని దేవదూతలను సలహా అడిగాడు. ఒక దుష్టాత్ముడు ముందుకి వచ్చి నేను వెళ్తాను. అహాబు ప్రవక్తలంతా కల్లలాడేలా చేస్తాను అని చెప్పాడు. ఇప్పుడు దేవుడు నీ ప్రవక్తలచే అబద్ధాలు చెప్పించి నిన్ను మోసగించడానికి ఆ దుష్టాత్మణ్ణి నీ కొలువులోకి పంపాడు సుమా అని చెప్పాడు. అనగా కపట ప్రవక్తల మాటలు నమ్మి అహాబు మోసపోయి అపజయం తెచ్చుకొంటాడని భావం. మీకాయా ఈ దృశ్యాన్ని కన్నులకు కట్టినట్లుగా వర్ణించాడు.

సిద్కియాకు ఈ మాటలు నచ్చలేదు. అతనికి రాజు ఆదరణం వుంది. కనుక అతడు దౌర్జన్యంతో మీకాయాను చెంపలు వాయించాడు. దేవుని ఆత్మ నాతో మాట్లాడింది. మరినీతో మాట్లాడిందెప్పుడు అని అడిగాడు మీకాయా శత్రుసైన్యం వచ్చి నగరాన్ని ముట్టడించినపుడు నీవు భయపడి మూలగదిలో దాగుకొంటావు. అప్పుడు నీకే తెలుస్తుందిపో అని జవాబిచ్చాడు.

రాజు తనకు అపజయం కలుగుతుందని చెప్పిన మీకాయాపై కోపించి అతన్ని చెరలో త్రోయించాడు. అతని ప్రవచనం నెరవేరకుండేలా చేయాలని అహాబు ఉద్దేశం. అతడు నేను యుద్ధంనుండి తిరిగి వచ్చిందాక మీకాయాకు ఆహారంగా రొట్టె నీళ్లు మాత్రమే ఈయండని

సేవకులను ఆజ్ఞాపించాడు. యుద్ధంనుండి తిరిగి వచ్చాక ప్రవక్తను చంపించవచ్చునని రాజు తలంపు. మీకాయా నీవు పోరు నుండి తిరిగివస్తే దేవుడు నాతో మాటలాడలేదనుకో అని ధైర్యంగా జవాబు చెప్పాడు. దేవుడు మీకాయా పక్షాననే వున్నాడు.

ఇద్దరు రాజులు సిరియా మీదికి యుద్దానికి వెళ్లారు. అహాబు మారు వేషంలో సైనికుళ్లాగ వెళ్లాడు. యెహోషాఫాత్తు రాజవస్త్రాలతోనే వెళ్లాడు. అహాబుది అంతా మోసం.

యుద్ధం జరుగుతుండగా సిరియా సైనికుడు ఒకడు తలవని తలంపుగా విల్లెక్కుపెట్టి బాణం విసిరాడు. అది నేరుగా వచ్చి రథం మీద వున్న అహాబుకి తగిలింది. అతని కవచం అతుకుల లోనికి దూరి శరీరంలోకి చొచ్చుకొని పోయింది. అతనికి నెత్తురు కారిపోయి ప్రాణగండం కలిగింది. ఐనా అహాబు తన సైన్యానికి ధైర్యం కలిగించ డానికి కమ్మీ అనుకొని రథంమీద నిలబడి వున్నాడు. తాను ఆరోగ్యంగానే వున్నట్లు నటించాడు. నెత్తురంతా కారిపోగా అతడు యుద్ధంలోనే మరణించాడు. ఈ విధంగా మీకాయా ప్రవచనం నెరవేరింది.

## 2. ప్రార్థనా భావాలు

1. అహాబు సిరియామీద యుద్ధంజేసి గిలాదును మళ్లా స్వాధీనం చేసికొని తనకు కీర్తి తెచ్చుకోవాలనుకొన్నాడు. కాని దేవుడు అతని నాశాన్ని కోరాడు. తానొకటి తలచిన దైవమొకటి తలుస్తాడు.

2. అహాబుది అంతా మోసం. మీకాయాను చెరలో పెట్టించడం, యుద్ధంలో వట్టి సైనికుళ్లాగ నటించడం, తీవ్రంగా గాయపడిన పిదపకూడ ఆరోగ్యంగా వున్నట్లు నటించి రథం కమ్మీమీద ఆనుకొని వుండడం అన్నీ మోసాలే. కాని మోసం గెలవదు.

3. ప్రవక్తల్లో నాల్గువందలమంది అబద్ధం చెప్పారు. ఒక్కడు మాత్రం సత్యం చెప్పాడు. చివరకు సత్యమే గెల్చింది. లోకంలో అబద్ధం చెప్పేవాళ్లే యెక్కువ. ఐనా అసత్యం గెలవదు.

4. సిద్కియాలాగ సొంతలాభం కొరకూ అధికారులను మెప్పించడం కొరకూ అబద్ధాలు చెప్పకూడదు. చివరకు అవమానం తెచ్చుకొంటాం.

5. మీకాయా రాజునీ, నాల్గు వందలమంది కపట ప్రవక్తలనూ ఎదిరించి నిల్చాడు అతని ధైర్యాన్ని మెచ్చుకోవాలి లోకంలో కొందరు నీతిన్యాయాల కొరకూ సత్యం కొరకూ పోరాడతారు. వాళ్లు మనకు ఆదర్శం కావాలి. కాని మనం సొంతలాభం కొరకు తరచుగా ప్రలోభాల్లో పడిపోతాం. ఈ కథను చదివిన తర్వాత మనలోని ఆ దుష్టప్రవృత్తిని సవరించుకోవాలి. నిజాయితీతో మెలిగేవాడు దేవునికి ప్రీతి కలిగిస్తాడు.

## 21. క్రీస్తు ప్రవక్త

ప్రభువు మీ ప్రజలనుండి నీవంటి ప్రవక్తనొకనిని మీచెంతకు పంపుతాడు అని మోషే నుడివాడు- ద్వితీ 18,15. ఈ ప్రవచనం క్రీస్తుపట్ల నెరవేరిందని పేతురు వాకొన్నాడు - అ.చ. 3,22. క్రీస్తు గాడిద నెక్కి యెరూషలేము ప్రవేశించినపుడు పురజనులు ఈయన నజరేతునుండి వచ్చిన ప్రవక్త అని చెప్పుకొన్నారు - మత్త 21,11. ప్రభువు రొట్టెలను పెంచి ఐదువేలమందికి పెట్టాక ప్రజలు ఇతడు యేలియా లాగ అద్భుతాలు చేసే ప్రవక్త అని చెప్పుకొన్నారు – యోహా 614. ఈయాలోకనాలను బట్టి క్రీస్తు ప్రజల దృష్టిలో ప్రవక్తగా చలామణి అయ్యాడు అనుకోవాలి.

క్రీస్తులో ప్రవక్త లక్షణాలు చాల కన్పిస్తాయి. ప్రవక్తలకులాగ అతనికి కూడ జ్ఞానస్నాన సమయంలో దైవదర్శనం కలిగింది. తండ్రి ఇతడు నా ప్రియకుమారుడు అని సాక్ష్యమిచ్చాడు – మార్కు 1,10.అతనికి నరుల హృదయంలోని సంగతులను తెలిసికొనే శక్తి వుంది. సమరయ స్త్రీతో నీకు ఐదుగురు భర్తలున్నారని చెప్పగానే ఆమె విస్తుపోయి అయ్యా! నీవు ప్రవక్తవు అని పల్కింది- యోహా 4,19. అతనికి భవిష్యత్ జ్ఞానం వుంది. తన మరణాన్ని గూర్చి ముందుగానే మూడుసార్లు

హెచ్చరించాడు. కాలసూచనలు ముందుగానే తెలిసి కొన్నాడు – మత్త 16,4.

ప్రభువు ప్రవక్తల్లాగే తన బోధలను నటించిచూపించాడు. అంజూరాన్ని శపించాడు. ఈ క్రియతన్ను నిరాకరించిన యూదులు దేవుని శాపానికి గురౌతారని సూచిస్తుంది – మత్త 21,19. ఈలాగే దేవాలయాన్ని శుద్ధజేసాడు. ఈ క్రియ మెస్సీయా తన ప్రజను శుద్ధిజేస్తాడు అనడానికి గురుతు – మార్కు 11,15.

అతనికి మోషే ఉపదేశాలూ, ప్రవక్తల బోధలూ బాగా తెలుసు – మత్త 22,40. ప్రభువు ప్రవక్తల్లాగే బోధించాడు. సొంత అధికారంతో గూడ బోధించాడు. మోషే ఆలా చెప్పాడు, నేనైతే ఈలా చెప్తున్నాను అని పల్కాడు.

అతడు ప్రవక్తల పద్ధతిలోనే అద్భుతాలుచేసాడు. అతని అద్భుతాలు ఏలీయా యెలీషా అద్భుతాలను జ్ఞప్తికి తెచ్చేవి. ప్రవక్తల్లాగే క్రీస్తుకూడ ఆత్మచే నడిపింపబడినవాడు. ఆత్మే అతన్ని ఎడారికి కొనిపోయింది – లూకా 4,1. అతడు పవిత్రాత్మ సాన్నిధ్యం వలన ఆనందించి తండ్రిని స్తుతించాడు – 10,21.

ప్రవక్తల పద్ధతిలోనే క్రీస్తు అనేక శ్రమలు అనుభించాడు. యూదులు అతని బోధను తిరస్కరించారు. అతన్ని బాధించి పరిహసించారు. కడన నగరం వెలుపల వధించారు – మత్త 23,37.

అతడు ప్రవక్తల కోవలో వచ్చిన అంత్యకాలపు ప్రవక్త. దేవుని సందేశాన్నీ దైవరాజ్యాన్నీ బోధించిన వక్త. అతన్ని జూచి మనం ప్రేరణం తెచ్చుకోవాలి.

## 22. నేటి సమాజంలో ప్రవక్తలు

అంత్యదినాల్లో నరులందరిమీద నాయాత్మను కుమ్మరిస్తాను అనే యోవేలు ప్రవచనం వుంది. ఆత్మ దిగివచ్చాక పేతురు యెరూషలేములో

ఈ ప్రవచనాన్ని ఉదాహరించాడు - అచ 2.17. ఈ వాగ్దానం ప్రకారం మెస్సీయా ప్రజలందరు ఆత్మను పొంది ప్రవచిస్తారు. తొలినాటి క్రైస్తవుల్లో ప్రవచన వరం ప్రచురంగానే వుండేది. కాని రానురాను తిరుసభలో ఈ శక్తి అంతరించింది. నేడు మళ్లా ఈ వరం చిగురిస్తుంది.

ప్రవచనం ప్రధాన ప్రయోజనం ప్రోత్సహించడం -1కొరి 14,3. ప్రవక్తలు యిస్రాయేలు ప్రజను ప్రోత్సహించి దేవుని దగ్గరికి రాబట్టడానికి ప్రవచనం చెప్పారు. కనుక నేడు మన భక్తులు ఈ వరంలో క్రైస్తవ సమాజాలను ప్రోత్సహించి దేవుని దగ్గరికి తీసుకురావాలి. ఈ ప్రోత్సాహం ప్రధానంగా వాక్యబోధద్వారా జరగాలి.

ఇంకా ప్రవక్తలు ప్రవచనం ద్వారా యూద సమాజంలోని దోషాలను చక్కదిద్దారు. జనానికి పశ్చాత్తాపం బోధించారు. నేడు మనం కూడ ఈ కార్యాన్ని కొనసాగించాలి. పైగా, ప్రవక్తలు ప్రజలను నడిపించారు. వాళ్ల ప్రస్తుతం చేయవలసిన పనులేమిటివో తెలియజేసారు. ఈ పద్ధతిలోనే నేడు మనంకూడ క్రైస్తవ సమాజానికి మంచి సలహాలనీయాలి. కనుక ప్రోత్సహించడం, దోషాలను చక్కదిద్దడం, మంచి సలహాలతో జనాన్ని నడిపించడం - ఈ మూడు మనం ప్రవచనం ద్వారా సాధించవలసిన ముఖ్యకార్యాలు.

ఒకవ్యక్తి ఇష్టపడి డోక్టరో టీచరో కావచ్చు. కాని ఏ నరుడు కూడ తన సొంత కోరికతోనే ప్రవక్తకాలేడు. అది దేవుడిచ్చే వరం. కాని ఈ వరాన్ని పొందడానికి మనలను మనం తయారుచేసికోవచ్చు. ఎలా? 1. బైబుల్లోని దైవవాక్యాన్ని భక్తితో ధ్యానంజేసికొని దేవుని చిత్తాన్ని తెలిసికోవాలి. 2. ప్రార్థన చేసికొని దేవుడు మన అంతరంగంలో మౌనంగా విన్పించే స్వరాన్ని వినడం నేర్చుకోవాలి. 3. తోడి ప్రజల అక్కరలూ అవసరాలూ గుర్తించాలి. ప్రవచనం ప్రధానంగా సమాజ శ్రేయస్సు కొరకు పుట్టింది. 4. నేను ప్రవక్తగా పేరు తెచ్చుకొంటాను అనే ప్రలోభానికి లొంగకూడదు. ప్రవచనం సేవావరం. దానిద్వారా తోడివారికి

మేలుచేస్తాం. ఈ పద్ధతిలో మనలను మనం సిద్ధంజేసికొని వినయంతో దేవుణ్ణి అడుగుకొంటే అతడు మనకు ఈ ప్రవచన వరాన్ని దయచేయవచ్చు.

ప్రవక్త కేవలం నోటితోనే మాటలాడడు. తన జీవితవిధానం ద్వారాగూడ మాటలాడతాడు. కనుక ప్రవక్తగా మెలిగేవాడు ఆదర్శజీవితం గడపాలి. అతని భక్తి విశ్వాసాలను జూచి దేవునికి దూరంగా బోయిన వాళ్లు మళ్లా దేవుని దగ్గరికి తిరిగివచ్చేలా వుండాలి. ప్రవక్తగా వుండేవాడు స్వార్థాన్ని అణచుకోవాలి. ఆ దుర్గుణం అన్ని కార్యాలను చెడగొడుతుంది.

యిస్రాయేలు ప్రవక్తలు పేదసాదలను పట్టించుకొన్నారు. దీనులు, అనాథులు, వితంతువులు, పరదేసులు మొదలైన బలహీన వర్గాలను ఆదుకొన్నారు. నేడు మన ప్రవక్తలు చేయవలసింది కూడ యిదే. వాళ్లు సమాజంలోని అట్టడుగువర్గాన్ని ఆదుకోవాలి. పేదాబక్కీ పట్ల జాలిజూపి చేయూత నివ్వాలి.

నేటి క్రైస్తవసమాజానికి ప్రవక్తలతో చాల అవసరముంది. ఐనా మన సమాజాల్లో ప్రవక్తలు అట్టేలేరు. ప్రజలకు దేవుని సందేశాన్ని విన్పించి వారిని దేవుని దగ్గరికి రాబట్టే ఆధ్యాత్మిక నాయకులు అరుదుగా కన్పిస్తారు. కనుక యెషయాలాగ ప్రభూ! నేనున్నాను గదా, నన్ను పంపండి నీ చిత్తమైతెన నేను వెళ్లి ప్రజలకు నీ సందేశం విన్పిస్తాను అని జపిద్దాం.

# 23. ప్రశ్నలు

1. ప్రవక్త అనే మాటకు అర్థమేమిటి?
2. ప్రవక్తల ముఖ్యలక్షణాలు ఏమిటివి?
3. ప్రవక్తల ముఖ్యబోధలను తెలియజేయండి?
4. యెషయా ప్రధాన భావాలను వివరించండి ?
5. యెషయా దేవుని పవిత్రతను వర్ణించిన తీరు తెలియజేయండి?
6. దేవదూత అతని పెదవులను కాల్చడంలో భావమేమిటి?
7. పుల్లని కాయలు కాసిన ద్రాక్షతోట వుపమానం ఇప్పుడు మనకేలా వర్తిస్తుంది?
8. ప్రవక్తలు బోధించిన సాంఘికన్యాయాన్ని వివరించండి ?
9. భగవంతుని ప్రేమ తల్లి ప్రేమకంటె బలీయమైంది అనే భావాన్ని వివరించండి?
10. నీ పేరు నా యరచేతులమీద వ్రాసికొన్నాను అంటే భావం ఏమిటి?
11. యిర్మీయా పడగొట్టేవాడు పునర్నిర్మించేవాడూ ఏలా గయ్యాడో వివరించండి.?
12. ప్రభువు తన వాక్కుని యిర్మీయా నోటిలో పెట్టాడు అంటే అర్థమేమిటి?
13. ప్రభువు నేను నీకు తోడుగా వుండినిన్ను కాపాడతాను అనడంలో భావమేమిటి?
14. హనన్యాకు శిక్షపడిన తీరు వివరించండి?
15. యిర్మీయా హృదయవేదనలను కొన్నిటిని వివరించండి. ?
16. యెహెజ్కేలు ప్రదానభావాలు వివరించండి?
17. ప్రవక్తకు కలిగిన దర్శనమూ దాని సందేశమూ వివరించండి?
18. దేవాలయంనుండి పారే యేరు ఏమేమి సాధిస్తుంది ? ఈ వేదభాగం ఇప్పుడు మన జీవితానికి ఏలా వర్తిస్తుంది?
19. ప్రవక్త ప్రభువు వాక్కుని తిన్నాడు అంటే భావం ఏమిటి?
20. ఈ వేద భాగం ఇప్పుడు మన బోధకులకు ఏలా ప్రేరణం పుట్టిస్తుంది?

21. హోషేయ జీవితమే ప్రవచనమైంది - వివరించండి.
22. హోషేయ వర్ణించిన దేవుని విఫలప్రేమను వివరించండి ?
23. ఆమోసు అమస్యా ఘర్షణను వివరించండి?
24. యోనా గ్రంథం నీతియేమిటి?
25. యావేలు ప్రవచనాన్ని వివరించండి. ?
26. మీకాయా కథనుండి దేవుడు మోసగాళ్లను ఓడించి నిజాయితీపరులను గెలిపిస్తాడు అనే సత్యాన్ని నిరూపించండి?
27. నేటి మన క్రైస్తవ సమాజాలకు ప్రవక్తలతో అవసరమేమిటి? వారి సేవలు ఏలా వుండాలి?
28. నీకు ప్రవక్త కావాలనే కోరికవుందా? దాన్ని ఏలా నెరవేర్చుకొంటావు?